


# నల్లంకి చూపు

“పొలంలో కాపలా పడుకున్న మా అల్లుడ్ని పిచ్చికుక్క కరిచిందంట. బొడ్డు చుట్టూరా ఇంజెక్షన్సు చెయ్యాలంట. పరామర్శించడానికి వెళ్తున్నా. కాస్త తోడొస్తావేంట్రా అబ్బా?” అనడిగేడు మోపెడ్డేసుకుని ఊళ్ళోకి దిగిన సుబ్బరాజుగాడు.

యానాం రేవులో ఆగున్న పెద్దపంటి మనుషుల్తో పాటు చిన్నకార్లనీ, జీపుల్నీ, ట్రాక్టర్లనీ కూడా ఎక్కించుకుని అద్దరికి చేర్చే పనిలో వుంది. అంత ఎక్కువలోడు పంటిలో ఎక్కించడం ఈ రేవులో తప్ప గోదావరి బెల్టు మొత్తం మీద మరే రేవులో లేదు.

ఆ పంటి మీదెక్కి ఆ వృద్ధగౌతమిలో ప్రయాణం చెయ్యడం చాలా ఇష్టం  నాకు. వెళ్ళడానికి ఒప్పుకున్నాను.

ఎదుర్లంక రేవు దాటాకా కుడిపక్కనున్న ముమ్మిడివరం సైడుకాకండా తిన్నగా వెళ్తే వచ్చే పెదమడి సుబ్బరాజు అల్లుడి ఊరు. తీరామేం వెళ్ళేటప్పటికి తెల్సిన సన్నాసి వార్తేటంటే పిచ్చికుక్క కరిచింది సుబ్బరాజుగారి అల్లుడ్ని కాదంట. వారి బావుజ్జీ అయిన పిన్నమరాజు మంగపతి రాజుగార్ని. మెల్లకన్నుంది గాబట్టి అంతా మెల్లకన్ను రాజుగారని కూడా అంటుంటారంట వార్ని.


చాలా వికారం వచ్చేసింది సుబ్బరాజుగాడిమీద. “మరి బయల్దేరదావా?” అని లేస్తుంటే దూకుడు మీదొచ్చి అడ్డంపడిపోయిన మెల్లకన్ను రాజుగారు, “చూడండి బాబూ మళ్ళీ మా పక్కకి ఎప్పుడొస్తారో ఏంటోగాని మా రాజుల ఆతిధ్యం కొంచెం పుచ్చుకునెళ్ళాలి తవరు” అంటా గడ్డిమేటు పక్కన తాటాకుమీద ఒడ్లగింజల్ని మేస్తున్న నల్లకోడిపిట్టని ఒడుపుగా పట్టేసుకుని అట్నుంచెళ్తున్న పాలేరు కందించి, “భోజనాలు ఏర్పాటు చెయ్యమని మీ అయ్యగారికి చెప్పరా సూర్రావూ”అన్నాడు.

“అయ్యగారికి అంటున్నారేంటి ఇంటి ఓనరు మీరు కాదండీ?” అనడిగాన్నేను.

నవ్వేసిన మెల్లకన్ను రాజుగారు, “మారాజుల ఇళ్ళల్లో భార్యని అయ్యగారు అని, తండ్రిని బావుజ్జీ అని పిలుస్తాం. వంట అయ్యేలోపు ఓ పుంజీడు చెన్నంగిబొండాలు పుచ్చుకుందాం రండి” అనేసి వాళ్ళ కొబ్బరితోటకి తీసుకెళ్ళేడు మమ్మల్ని.

వెళ్తున్న మాకు తోటకి దూరంగా దగ్గర దగ్గర ఏడెకరాల స్థలంలో పడిపోయిన పాటిమట్టి కోటగోడలు కనపించినియ్యి అవేంటన్నాను.

"అది నడింపిల్లి హరికృష్ణరాజుగారి దివాణంవండి. పద్దెనిమిదివందల ఆరులోదండి అది. వంటలవడానికి కొంచెం సేపవుద్దికాబట్టి, ఈలోగా దివాణం కథొకటి చెపుతాను. వింటా అలా గోదారేపెళదాం. వస్తారేంటి?" అన్నాడు.



వాళ్ళ వంటలు మేం మెక్కే లోపల మాకింకో పనిలేదు కాబట్టి, "సరేకానివ్వండి ఆ కత" అన్నాను.

"నల్లఎంకి తక్కువ కులపోళ్ళ మనిషండి. నిగనిగలాడే నల్లటి శరీరవండి తనది. పెద్దకళ్ళు, రూపాయిబిళ్ళంత ఎఱ్రటిబొట్టు, నిద్రలోకూడా నవ్వుతావుండే మొకం, ముక్కుకి ఇత్తడి సత్తూ, చెవులకి కెంపురాళ్ళ ఇత్తడికమలాలు. కాళ్ళకి వెండితోడాలతో అమ్మోరిలాగుండేది. ఒకోసారి ఆ మనిషినడవడిక జూస్తున్న ఊరోళ్ళకి ఆ మనిషినల్లఎంకి కాదు. పచ్చటి మా పొలాల మధ్య గుళ్ళో ఉన్న మా దేవత వెంపర్తమ్మేనేమో" అనిపించేది.

ఊరి చివర్నున్న పెద్ద దివాణానికి అధిపతులు నడింపిల్లి హరిక్రిష్ణం రాజుగారరూ, శివన్నారాయణరాజు గారూనూ. ఈచుట్టుపక్కల్లో రైతులకి వీరే ప్రభువులండి. రెండువేల ఎకరాల కోనసీమ మాగాణీ అండీ ఈరిది.

తమ్ముడయిన శివన్నారాయణ దివాణం పనులూ, ఆస్తులు ఎవ్వారాల్లాటివి చూసుకుంటాడు. ఓడలో లండన్వెళ్ళి బారిష్టరు చదువుకొచ్చిన అన్నగారు హరికృష్ణంరాజుగారికీ, బ్రిటీష్ దొరలకీ మంచి దోస్తు, పొద్దోతే దీపాల్లో నిండిపోయి కళకళ్ళాడతా ఉంటది దివాణం.

సాయంత్రం నాలుగు గంటలు దాటింది. గోదావరిలోంచి చల్లటిగాలి వీస్తుంది. వేటకెళ్ళే నావలు. తెరచాప పడవలూ లాంచీలూ జనాన్ని అటూ ఇటూ తిప్పే పెద్ద పంటితో సందడి సందడిగా ఉంది. రేవులో పిడతకింద పప్పు బండోడి చుట్టూ చాలామంది జనం

చేరుకున్నారు. బజ్జీలూ చల్లపొణుకులూ వేసే షావుకారు పెళ్ళాం మూకిట్లో వేగుతున్న మసాలాగారెల్ని అపకతో దేవుతుంటే ఆ మనిషి పక్కనే ఉన్న కుంటి షావుకారు పెట్రోమాక్స్‌లైటుకి గాలి కొడ్తున్నాడు.

టిక్కెట్ల గుమస్తా వీరభద్రరావున్న రెల్లుగడ్డిపాకలో వేస్తున్న బల్లమీద కూర్చున్న నడింపిల్లి దివాణంలో మేనేజరు రేవులో కొస్తున్న రెండు సవారీ బళ్ళని చూసి లేచేడు.

ఆగిన ఆ రెండు సవ్వారీబళ్ళలోంచి దివాణంలో ఇంకో మేనేజరు దిగేక దుళ్ళ అవతలున్న మురమండ భోగం మేళం దిగింది. రంగురంగుల చీరల్లో చిలకల్లా ఉన్న అమ్మాయిలు చెంగు ఛెంగుమని దూకుతుంటే వాళ్ళకి నాయకురాలైన కృష్ణవేణి జాగ్రత్తే పిల్లల్లారా అంటుంది. వాళ్ళంతా దిగేకా హార్మోనిస్టూ, డోలక్ వాయించేవాడూ దిగేరు.

ఇంకాస్సేపటికి ఇంకో రెండు సవ్వారీ బళ్ళు ఆగేయి. అందులోంచి దూకేడు దివాణంలో ఇంకో మేనేజరు. తర్వాత రకరకాల అమ్మాయిలు బండిలోంచి దిగడం మొదలెట్టేరు. అది పసలపూడీ, ద్రాక్షారామం కల్సిన మేళం. ఇంకాస్సేపటికి ఇంకో మూడు సవ్వారీబళ్ళాగినియ్యి. అది పెద్దాపురం మేళం. అందులో ఆడపిల్లలంతా పొగరుమోతు గిత్తలాగున్నారు.

మేనేజర్లంతా ఈ మేళాల వాళ్ళందర్నీ పంటి ఎక్కించి అవతలొడ్డుకి తీసుకెళ్ళి అక్కడ ఆగున్న సవ్వారీబళ్ళలో ఎక్కించి నడింపిల్లి దివాణంలో ఉన్న అతిథి గృహాల్లో దింపేటప్పటికి చీకటి పడిపోయింది.

అక్కడున్న నల్లఎంకి దగ్గర కొచ్చిన మేళంలో పిల్లల్లో మాకు వేణ్నీళ్ళు కావాలి అని ఒకళ్ళు, నాకు మీగడేసిన టీ కావాలని ఇంకొక్కళ్ళు నేను పలహారం చేసేకానే స్నానం చేస్తానని ఒకమ్మాయి గుంజేస్తున్నారు ఎంకిని. ఏమాత్రం విసుక్కోకండా నవ్వుతా వాళ్ళడిగేవన్నీ చేసి పెడ్తుంది ఎంకి.

అన్నీ చెకచెకా చేసుకెళ్ళిపోతున్న ఎంకికేసి విస్తుపోతా చూసిన ఆ పిల్లలంతా ''ఎంత ఓపిక నీకు'' అని తెగ మెచ్చేసుకుని డబ్బు లివ్వబోతుంటే ''వద్దమ్మలూ..నేను డబ్బులు పుచ్చుకోడం కోసం చెయ్యడం లేదీ పన్లు. గౌరవమైన నడింపిల్లి దివాణంలో మా అతిథులకోసం చేస్తన్నాను బుల్లీ'' అంది.

దొరలూ దొరసానులూ వచ్చేరు

విందులూ, వినోదాలూ అయ్యి అతిథులు వెళ్ళేసరికి ఆకాశంలో పిల్లలకోడి, గొల్లకావిడీ ఒక పక్కనించి ఇంకో పక్కకి జరిగినియ్యి. ఆ బ్రహ్మముహూర్తం వేళ ఏ విసుగూ లేకండా నవ్వుతా ఎంగిలిపళ్ళేలూ, ఎర్రతివాచీ మీద కక్కులూ తుడిచి శుభ్రం చేసి వెలుగొచ్చేసరికి, నవ్వుతా ఎదురొచ్చిన వాళ్ళని, ''ఏంటి బాబయ్యా అలా చూత్తన్నారూ?'' అనేసి పలకరించింది నల్లఎంకి.

ఎప్పుడు జూడండి ఏదో పని చేస్తూ వుంటదామనిషి.

మరకాళ్ళ గోవిందుకూతురు చెంపలకి గాలి బిళ్ళలేస్తే తనెళ్ళి బరింకపాలు తెచ్చి తగ్గేదాకా ఆ పిల్ల నోకంట చూసుకుంటూనే వుంది. చెవిటిసత్యం అత్తగారు పోతే పిల్లదినం, పెద్దదినం అయ్యేదాకా వచ్చి చూసి పోతానే వుంది. కోవటిపద్మగారి ఆఖరిది సరళ సవర్తాడినప్పుడు తను వేలెట్టని పన్లేదు. ఇలాగ ఒట్టి దివాణంలో వాళ్ళకేగాకండా ఊరి జనం పన్లుకూడా చేసి పెట్టేది ఎంకి.

* * *

హరికృష్ణంరాజుగారి ఒకే ఒకబ్బాయి అయిన జగన్నాథరాజుకి పెళ్ళయింది.

సీతానగరం అవతలున్న చర్లరాజుపాలెం సంస్థానం నుంచి వచ్చి బంగారువంకీ అంత అందమైన కోడలు బుచ్చి వెంకాయమ్మ మెళ్ళో కాసులకాయ గుళ్ళు (ఒకరకం నగ) పోయింది.

దివాణంలో పనిచేసే అందర్నీ వాకబు చెయ్యడం అయ్యాకా బుచ్చివెంకాయమ్మ దృష్టి నల్లఎంకిమీద పడింది. దాంతో, రాత్రిగదిలో కొచ్చిన బుచ్చివెంకాయమ్మ ''నాకెందుకో ఆ నల్లఎంకి మీద చాలా అనుమానంగా ఉంది. దాని చూపు దాని వాటం చూస్తుంటే అదంతా నటనలాగ అనిపిస్తుందండీ'' అంది భర్తయిన జగన్నాథరాజుతో.

అవాక్కయిపోయిన ఆ బుల్లిరాజు ''నువ్వు ఎవరి గురించీ మాటాడ్తున్నావూ..ఆ ఎంకి గురించా?'' అన్నాడు.

అవునంది బుచ్చివెంకాయమ్మ.

''తప్పు లెంపలేసుకో. నన్ను కన్నతల్లికంటే గొప్పది. చిన్నప్పుడు నన్ను తన వీపు మీదెక్కించుకుని ఈ దివాణమంతా తిప్పిన మనిషిఎంకి'' అన్నాడు.

''మీకు సేవలు చెయ్యడానికీ నగ దొంగతనం చెయ్యడానికి సంబంధం లేదు. అది చేసిన మనిషి ఇది చెయ్యగూడదని రూలా. ఆ బంగారపు నగ చూసిన ఎలాంటోడికైనా మోజు కలుగుద్ది'' అంది రాణి.

''ఏమో...నువ్వెందుకో తప్పుగా ఆలోచిస్తున్నావనిపిస్తుంది నాకు'' అన్నాడు జగన్నాథరాజు.

''నేనలాగ అనుకోడం లేదు. మీరు కొంచెం ఆ నల్లఎంకిని వెనకేసుకురావడం మానేస్తే ఆ దొంగెవరో తెల్సుకుంటాను'' అంది రాణి.

''సరే కానియ్...అదీ చూద్దాం'' అన్నాడు జగన్నాథరాజు.

దివాణంలో జనం నల్లఎంకిని అనుమానించడమేంటని ఎదురు ప్రశ్నలేసారు. ఊరి జనవయితే అసలీ ఆలోచన ఎవరిదని ముక్కుమీద వేలేసుకున్నారు.

కానీ, కొత్తకోడలు బుచ్చి వెంకాయమ్మ ఔనుగాక ఔనంటుంది.

దివాణంలో పెద్ద చర్చ జరిగాక ఎవరి సలహా మీదో అంజనం వేద్దామని కరారు చేసుకున్నారు.

చీకటిగది. ఆ గదిలో పెద్ద ఆంజనేయస్వామి ఫొటో. దాని ముందు ఆముదం దీపం. ఆ దీపం ముందు ఎనిమిదేళ్ళపిల్ల.

ఆ పిల్ల బొటనవేలు గోటికి ఆముదం మసి రాసి దీపం ముందు కూర్చోబెట్టేసరికి దీపం తాలూక నీడ ఆ పిల్ల బొటనవేలు గోటిమీద పడ్తుంది.

అమలాపురం నించి వచ్చిన ఒక తెల్లటి పెద్ద గెడ్డం ముసలోడు ఆ పిల్ల పక్కనే కూర్చుని ''చూడు పాపా నీకు గోటిమీద ఎవరు కనబడతన్నారమ్మా?'' అన్నాడు.

గోరు వేపు చూసిన ఆ పిల్ల ఎవరూ కనబడ్డం లేదు అంది.

''అలాక్కాదు. నువ్వు తింగరిచూపులు చూడకుండా గోటిలోకే చూస్తే కనపడతారు... బుల్లీ సరిగా చూసి చెప్పమ్మా..'' అని కొంచెం సేపు ఆగిన ఆ ముసలాయన ''మన దివాణంలో వాళ్ళెవరన్నా కనపడతన్నారా నీకు? తప్పకండా కనపడతారు సరిగ్గా చూడుపాపా'' అన్నాడు.

కిటికీ గాలికి ఆముదం దీపం కదిలింది. దాని ప్రతిబింబంకూడా కదిలేసరికి ''ఎవరో కదుల్తున్నట్టుంది'' అందా పసిపిల్ల.

''ఉంది కదా... ఆ కదిలే మనిషిచెప్పమ్మా దివాణంలో పనిచేసే నాగమణా, పార్వతా, వరలక్ష్మా, నల్లఎంకా... సరిగ్గా చెప్పు?'' అన్నాడా ముసలోడు. ముసలోడలా కుదిపేస్తుంటే ''ఏమో గోరంతా నల్లగా ఉంది... నల్లగా కదుల్తుంది'' అందా పిల్ల.

''ఆ కదిలేది ఈసారి బాగా కనపడద్ది. నీకంటికి దాన్ని చూసి సరిగ్గా చెప్పాలి అర్థమైందామ్మా?''

అలాగ ఆ చంటిపిల్లని ఊపిరాడనివ్వకుండా చేసి ఏవేవో అందించి, ఎగేసి కుదిపేస్తుంటే మసిరాసి ఉన్న ఆబొటనవేలు మీద ఒక ఆడమనిషి కదిలివెళ్తున్నట్టు, ఆ మనిషి నల్ల ఎంకి అయినట్టు, ఆ ఎంకి కోడలు రాణి గదిలో కెళ్ళి కాసుల కాయగుళ్ళు నగ దొంగతనం చేసినట్టు చెప్పించారు. అలాగ అంజనం తంతులో నగ తీసిన దొంగ నల్లఎంకి అని తేల్చారు.

దివాణంలో జనం, ఊళ్ళో జనం చచ్చినా ఒప్పుకోమన్నారు.

ఎంకిని పిల్చిన దివాన్జీ లక్ష్మీనారాయణ, ''దొంగతనం చేసిన సరుకు మాకందజెయ్యి'' అన్నారు.

''ఎవర్ని బాబూ ఇలా అడుగుతున్నారు. నా ఇంట్లోనేను దొంగతనం చేసుకోవడ మేంటి? అసల్నా గురించి ఏమనుకుంటున్నారేంటి బాబూ?'' ఎన్ని సార్లడిగినా ఈ పద్ధతిలో ఎదురొచ్చింది నల్లఎంకి.

ఇక ఈ మనిషితో ఇలాగ లాభం లేదని దీపాలవేళయ్యాక ఎంకి బొడ్డుమీద కుమ్మరిపురుగు ల్నొదిలి అవి పొట్టదాటి ఎటూపోకుండా మీద డాల్డా డబ్బాని బోర్లాపెట్టి కట్టేసి, ఎంకిని తీసుకెళ్ళి గేదెల్ని కట్టే పగ్గాలతో చెట్టుకు కట్టేసి, నిజం ఒప్పుకొనేదాకా నీకీ శిక్ష తప్పదన్నారు.

బాధను తట్టుకోలేక, నానా హింసపడీ... పడీ రెండోఝామయ్యేటప్పటికి చచ్చిపోయింది నల్లఎంకి. మురుగునీళ్ళు దిగడానికి గోదారి ఒడ్డున ఒక తూముంది. తెల్లారేలోపు ఎవరికీ తెలీకుండా ఎంకి శవాన్ని ఆ తూము కింద కప్పెట్టేసేరు.

ఎంకి చచ్చిపోయిన వార్త తెల్సిన, ఊరు మొత్తం ఏడ్చింది. కొంతమందయితే పిల్లదినం దాకా పచ్చి మంచినీళ్ళు ముట్టుకోలేదు. ఆ కొత్తకోడలకి, కోటగోడలకి పెట్టగూడని శాపనార్థాలు పెట్టేరు.

కొన్నాళ్ళకి పోయిన బుచ్చివెంకాయమ్మగారి నగ కాసులకాయ గుళ్ళు నూతిలో దొరికింది.

రాజులు ఎంకిని చంపిన విషయం బ్రిటీషోళ్ళకి తెల్సింది. శిక్షగా పెదరాజుగార్ని ఒకవారం గృహనిర్బంధం చేసి, ఎంకిని పాతిపెట్టిన ఆ మురికినీళ్ళ తూముకి నల్లఎంకి తూము అని పేరు పెట్టారు బ్రిటీషోళ్ళు.

ఇది జరిగి రెండువందల ఏళ్ళ పైచిలుకు అయింది.

ఇపుడు రాజులు లేరు. రాజ్యాలు లేవు. కోటలు అంతరించిపోతున్నాయి.

కానీ, ''చెక్కుచెదరని ఆనాటి నల్లఎంకితూము ఇప్పటికీ వుంది'' అన్నాడు మెల్లకన్నురాజు.

''ఎక్కడండి? పదండి చూసొద్దాం'' ఆవేశంగా అన్నాన్నేను.

''ఇప్పుడు మనం దానిమీద కూర్చునే మాట్లాడుకుంటున్నాం'' అని రాజు అనడంతో ఒంచి వొదిలిన కావిడిబద్దలా లేచిన నేను తూము కిందికి దిగి తొంగిచూసేను.

''ఏంటిబాబూ అలా సూత్తన్నారు?'' అనేసి నవ్వుతా ఎంకి పలకరించినట్టనిపించింది. ఆ క్షణంలో రెండు కన్నీటి చుక్కలు నా కళ్ళలోంచి జారి నల్లఎంకితూము లోంచి పారుతున్న నీళ్ళలోకి జారినియ్యి.

* * *



వంశీ మా పసలపూడి కథలు-72